25122023-MAI-08_Layout 1 12/25/2023 3:02 AM Page 1

ఏడుగురు అధికారుల బదిలీ

హైదరాబాద్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. వీరిలో ఆరుగురు ఐఏఎస్ అధికారులు కాగా, ఒకరు ఐపీఎస్ అధికారి ఉన్నారు.

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ
జ్యోతి బుద్ధప్రకాశ్	ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్	ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్
ఈ శ్రీధర్	గిరిజన సంక్షేమం ప్రత్యేక కార్యదర్శి	ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, టీఎస్ఐఐసీ(ఎఫ్ఏసీ) వైస్ చైర్మన్, ఎండీ
భారతి హోళికేరి	రంగారెడ్డి కలెక్టర్	జీపీడీకి అటాచ్
గౌతమ్ పోట్రు	మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టర్	రంగారెడ్డి కలెక్టర్
శృతి ఓజా	జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్	ఇంటర్, సెంకండరీ బోర్డు కార్యదర్శి
ఈవీ నర్సింహారెడ్డి	టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ	గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్
దేవేంద్రసింగ్ చౌహాన్	వెయిటింగ్	పౌరసరఫరాల శాఖ కమిషనర్

ఊడిన బస్సు చక్రాలు

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఘటన

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద టైర్లు ఊడిపోవడంతో ఓ వైపు ఒరిగిన ఆర్టీసీ బస్సు

ఎల్కతుర్తి/హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రన్నింగ్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు వెనుకటైర్లు ఊడిపోగా.. డ్రైవర్ చాకచక్యంతో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకున్నది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డిపోకు చెందిన పల్లె వెలుగు అద్దె బస్సు సుమారు 80 మంది ప్రయాణికులతో హుజూరాబాద్ నుంచి హనుమకొండకు బయలుదేరింది. బస్సు వెనుక నుంచి శబ్దం వస్తుందని ప్రయాణికులు డ్రైవర్‌కు తెలిపారు. డ్రైవర్ రాజు బస్సు ఆపి వెనుక టైర్లను పరిశీలించారు. అక్కడి నుంచి మెల్లగా బస్సును తీసుకెళ్తుండగా ఎల్కతుర్తి గ్రామ ప్రారంభ సరిహద్దులో వెనుక టైర్లు ఒక్కసారిగా ఊడిపోయి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లో దూసుకుపోయాయి. టైర్లు లేకపోవడంతో రన్నింగ్‌లో ఉన్న బస్సు ఓవైపు ఒరిగింది. ఒక్కసారిగా బస్సు కుదిపేయడంతో వెనుక ఉన్న ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడగా స్వల్ప గాయాలయ్యాయి. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ చాకచక్యంగా బ్రేక్ వేయడంతో బస్సు నిలిచిపోయింది. బస్సు వేగంగా ఉంటే తమ ప్రాణాలు గాల్లో కలిసేవని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులు ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తున్నది. వీరంతా మరో బస్సులో తమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

ఓవర్ లోడ్ ప్రచారం అర్థరహితం

ఓవర్ లోడ్ కారణంగా బస్సు చక్రాలు ఊడినట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. బస్సులో 80 మంది ప్రయాణికులు ఉన్నార న్నది అబద్ధమని, ఆ సమయంలో సుమారు 42 మంది మాత్రమే ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. అద్దె బస్సుల నిర్వహణ విషయంలో వాటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సురక్షితమైన ప్రయాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా పూర్తి సామర్థ్యంతో బస్సులను నడపాలని ఆదేశించారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు.

'బస్సులో కండక్టర్ చేతివాటం' వైరల్

- బస్సులో నుంచి విసిరేసిన 'మహాలక్ష్మి' టికెట్లు లభ్యం
- 'నమస్తే తెలంగాణ' కథనంతో అధికారుల స్పందన
- విచారణ చేపట్టి కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశం

గండీడ్ నుంచి సల్కర్‌పేట్ వరకు జారీ చేసిన జీరో టికెట్లు

కోస్గి/తాండూరు, డిసెంబర్ 24: మహబూబ్‌నగర్-తాండూర్ రూట్‌లో నడిచే తాండూర్ డిపో బస్సులో మహిళలు లేకున్నా.. కండక్టర్ వారి పేరిట టికెట్లను జారీ చేసి వాటిని కిటికీలో నుంచి బయటకు పారేశారు. ఈ ఘటనపై 'బస్సులో కండక్టర్ చేతివాటం' శీర్షికన ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం సల్కర్‌పేట్, జనుంపల్లి గ్రామాల యువకులు కండక్టర్ బస్సులో నుంచి పారేసిన టికెట్లను గుర్తించారు. సల్కర్‌పేట్ శివారులో 16 టికెట్లు, జనుంపల్లి శివారులో 45 టికెట్ల కట్టలను సేకరించారు. ఇందులో గండీడ్ నుంచి సల్కర్‌పేట్ వరకు ఇచ్చిన టికెట్లే ఎక్కువగా ఉన్నాయని, ఈ నిర్వాకానికి పాల్పడిన సదరు కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించారు. తాండూరు డిపోకు చెందిన బస్సు(టీఎస్ 34, టీపీ 5189) కండక్టర్ కే శ్రీనివాస్.. బస్సులో మహిళలు ఎక్కకున్నా టికెట్లు ప్రింట్ చేసి మహిళా ప్రయాణికులు ఎక్కినట్టు చూపించడంపై తమకు వీడియోతో కూడిన ఆధారాలు చేరాయని, ఈ ఘటనపై విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పూర్తి విచారణ అనంతరం సదరు కండక్టర్‌పై చర్యలు తీసుకుంటామని తాండూరు ఆర్టీసీ డీఎం పేర్కొన్నారు.

కోకాపేటలో జరిగిన అవగాహన సమావేశంలో పాల్గొన్న వీవర్స్, ఇతర ప్రతినిధులు

వరల్డ్ హ్యాండ్లూమ్ డేను సాధించుకుందాం

వరల్డ్ వీవర్స్ కాన్ఫరెన్స్‌లో వక్తల పిలుపు

హైదరాబాద్, డిసెంబర్24(నమస్తే తెలంగాణ): జాతీయ చేనేత దినోత్సవాన్ని సాధించుకున్న తరహాలోనే ప్రపంచ చేనేత దినోత్సవ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వరల్డ్ వీవర్స్ కాన్ఫరెన్స్‌లో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఇండోనేషియా దేశంలోని బాలిలో ఫిబ్రవరి 18న జరగనున్న వరల్డ్ వీవర్స్ కాన్ఫరెన్స్‌పై హైదరాబాద్ కోకాపేటలోని హేమంత్‌సిరి స్టూడియోలో ఆదివారం అవగాహన సమావేశం జరిగింది. వరల్డ్ వీవర్స్ కాన్ఫరెన్స్ నిర్వాహకుడు యర్రమాద వెంకన్న నేత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ వరల్డ్ వీవర్స్ కాన్ఫరెన్స్ ప్రాధాన్యాన్ని వివరించారు. మిషన్ వరల్డ్ హ్యాండ్లూమ్ డేకి మద్దతు తెలపాలని, ఆ భావజాలాన్ని మరింత విస్తృతపర్చాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టెక్స్‌టైల్ నేషనల్ అడ్వైజర్ హెచ్‌కే చారి, యర్రా శ్రీనివాస్‌రావు, అహింస సిల్క్ ఇన్వెంటర్ రాజయ్య, సంగీత నృత్యరూపక రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, హేమంత్‌సిరి లేబుల్ వ్యవస్థాపకురాలు శిరీష, లేబుల్ రామ వ్యవస్థాపకురాలు మవూరి రాజేశ్వరి, టెక్స్‌టైల్ డిజైనర్లు లావణ్య సిస్టాల, రత్న, వీవర్స్ ఆఫ్ ఇండియా డాక్యుమెంటరీ చిత్ర దర్శకులు రాఘవేంద్ర, జెల్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా లేక చీకట్లో మగ్గుతున్న అలంపూర్‌లోని వంద పడకల దవాఖాన

ప్రభుత్వ కార్యాలయాలకు పవర్ కట్

- అలంపూర్ మార్కెట్ యార్డు,
- వంద పడకల దవాఖాన,
- ఫైర్‌స్టేషన్‌లో చీకట్లు
- పెండింగ్‌లో మూడు నెలల విద్యుత్తు బిల్లులు
- వారం రోజులుగా చీకట్లోనే అధికారుల విధులు
- తాగునీరు, కాలకృత్యాల కోసం ఇబ్బందులు

అలంపూర్, డిసెంబర్ 24: జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు, వంద పడకల దవాఖాన, ఫైర్‌స్టేషన్‌కు విద్యుత్తు అధికారులు పవర్ కట్ చేశారు. దీంతో ఆయా కార్యాలయాల్లోని అధికారులు, సిబ్బంది వారం రోజులుగా చీకట్లోనే విధులు నిర్వహిస్తున్నారు. అలంపూర్ చౌరస్తాలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు, కొత్తగా ప్రారంభించిన వంద పడకల దవాఖానకు సంబంధించి మూడు నెలల నుంచి విద్యుత్తు బిల్లులు చెల్లించడం లేదని, వ్యవసాయ మార్కెట్ యార్డుకు రూ.20 వేలు, దవాఖానకు 54 వేల రూపాయల బిల్లు పెండింగ్‌లో ఉన్నదని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చీకట్లు కమ్ముకున్నాయని, అయినా పట్టించుకునే వారే కరువయ్యారని విమర్శలొస్తున్నాయి. విద్యుత్తు సరఫరా లేక సిబ్బంది దీపపు వెలుగులోనే విధులు నిర్వర్తిస్తున్నారు. కరెంట్‌తోపాటు మంచి నీళ్లు కూడా లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి హోటళ్లు, పెట్రోల్ బంక్‌లకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని సిబ్బంది వాపోతున్నారు. వంద పడకల దవాఖానలో రూ.కోట్ల విలువ చేసే వైద్య పరికరాలు ఉన్నాయి. కరెంట్ లేక చీకటిగా ఉండటంతో అక్కడ వస్తువులు చోరీకి గురయ్యే అవకాశం ఉందని, ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు తీసుకొని పరిస్థితులు చక్కదిద్దాలని అక్కడి పలువురు సిబ్బంది కోరుతున్నారు.

పునరుత్పాదక వనరుల నుంచే

సగం విద్యుత్తు

- 2032 నాటికి దేశంలో మూడు రెట్లు పెరగనున్న ఉత్పత్తి
- క్రిసిల్ ఇంటెలిజెన్స్ నిపుణుల అంచనా
- తెలంగాణలో భారీగా పెరిగిన సౌర విద్యుత్తు ఉత్పత్తి
- తొమ్మిదిన్నరేండ్లలో 72 నుంచి 5,600 మెగావాట్లకు చేరిక

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): శిలాజ ఇంధన వినియోగాన్ని పూర్తిగా తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించుకునేందుకు ప్రపంచ దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ జాబితాలో భారత్ కూడా ముందు వరుసలోనే ఉన్నది. 2032 నాటికి భారత్‌లో సగం విద్యుత్తు పునరుత్పాదక ఇంధన (ఆర్ఈ) వనరుల నుంచే ఉత్పత్తి అవుతుందని ప్రముఖ గ్లోబల్ ఎనలిటిక్స్ కంపెనీ 'క్రిసిల్' అభిప్రాయపడింది. ప్రస్తుతం మన దేశంలో 172 గిగావాట్లుగా ఉన్న ఆర్ఈ ఇన్‌స్టాల్డ్ బేస్ రానున్న పదేండ్లలో మూడు రెట్లు పెరిగి 550 గిగావాట్లకు చేరుకుంటుందని క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ అండ్ అనలిటిక్స్ నిపుణుల అంచనా వేశారు. ఇందులో 270 నుంచి 290 గిగావాట్ల సౌర విద్యుత్తు, 120 నుంచి 140 గిగావాట్ల పవన విద్యుత్తు, 40-60 గిగావాట్ల జల విద్యుత్తు ఉంటుందని విశ్లేషించారు.

కేసీఆర్ హయాంలో పెరిగిన సౌర విద్యుదుత్పత్తి

నాటి సీఎం కేసీఆర్ పునర్వినియోగ ఇంధన ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిచ్చారు. దీంతో తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో కేవలం 74 మెగావాట్లుగా ఉన్న సౌర విద్యుత్తు ఉత్పత్తి.. గత తొమ్మిదిన్నర ఏండ్లలో ఏకంగా 5,600 మెగావాట్లకు పెరిగింది. దీని తోపాటు ప్రస్తుతం రాష్ట్రంలో గ్యాస్ ద్వారా 807.31 మెగావాట్లు, మినీ హైడల్, బయోమాస్ ద్వారా 256.24 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతున్నది.

స్కిల్ ఉంటే జాబ్ పక్కా

- ఐటీలో ట్రెండింగ్ ఉద్యోగాలకు ఆకర్షణీయ వేతనాలు
- ఫ్రెషర్లకూ అందివచ్చే అవకాశాలు.. స్కిల్స్‌తోనే పని
- వచ్చే నాలుగైదేండ్ల వరకు ఉద్యోగాలకు ఢోకా లేదు

ఐటీలో ట్రెండింగ్ టాప్ జాబ్ రోల్స్ ఇవే..

- ఫుల్ స్టాక్ డెవలపర్
- ఆండ్రాయిడ్ డెవలపర్
- ఏడబ్ల్యూఎస్ ఇంజినీర్
- రోబోటిక్ ఇంజినీర్
- డెవాప్స్ ఇంజినీర్
- ఏఐ-ఎంఎల్ ఇంజినీర్
- బ్లాక్‌చైన్ టెక్నాలజీ డెవలపర్
- సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్
- డాటా సైంటిస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): జీతం పెద్ద మ్యాటర్ కాదు, స్కిల్ ఉంటే చాలు.. ఎంతైనా ఇచ్చి తీసుకుంటాం.. ఇదీ ఐటీ కంపెనీల మాట. మారుతున్న టెక్నాలజీకి తగ్గట్టు అప్‌డేట్ అయ్యేవారికోసం నిత్యం శోధిస్తూనే ఉంటాయి. నైపుణ్యం ఉంటే జాబ్ పక్కా అని రిక్రూటింగ్ సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఐటీలో ట్రెండింగ్ జాబ్ రోల్స్ జాబితాలో ఫుల్ స్టాక్ డెవలపర్, ఆండ్రాయిడ్ డెవలపర్, ఏడబ్ల్యూఎస్ ఇంజినీర్, రోబోటిక్ ఇంజినీర్, డెవాప్స్ ఇంజినీర్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ డెవలపర్, ఏఐ-ఎంఎల్ ఇంజినీర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, డాటా సైంటిస్ట్ వంటివి ఉన్నాయి. మరో నాలుగైదేండ్ల పాటు ఈ ఉద్యోగాలకు ఢోకా లేదు. మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ వంటి కంపెనీలు సైతం ఈ అంశాల్లో నైపుణ్యం ఉన్నవారికోసం వెతుకుతున్నాయి.

అత్యధిక ప్యాకేజీలు వీటికే

ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఐటీ జాబ్ రోల్స్‌కు వార్షిక ప్యాకేజీలు సైతం ఎంతో ఆకర్షణీయంగా ఉంటున్నాయి. ఉదాహరణకు ఫుల్‌స్టాక్ డెవలపర్(ప్రెషర్)కు రూ.5-6 లక్షల వార్షిక వేతనం ఉంటే, డాటా సైంటిస్ట్‌కు ఏడాదికి రూ.11 లక్షల వరకు ఉంటుంది. ఉద్యోగ ప్రారంభంలోనే ఈ స్థాయి వేతనాలు ఇచ్చేందుకు ఐటీ కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. 'కాలేజీల్లో ఉండగానే ఇంజినీరింగ్ విద్యార్థులు ఆయా టెక్నాలజీలపై నైపుణ్యం సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఉద్యోగంలో చేరాక టెక్నాలజీలపై అప్‌డేట్‌గా ఉంటే ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుకోవచ్చు. పెద్ద కంపెనీల ఆఫర్లు తలుపు తడతాయి' అని సీనియర్ ఐటీ ఉద్యోగులు పేర్కొంటున్నారు.



ఆదివాసీ విద్యార్థి సంఘం నూతన కమిటీ సభ్యులు

ఆదివాసీ విద్యార్థి సంఘం ఎన్నిక

సికింద్రాబాద్, డిసెంబర్ 24: ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీని ఆదివారం హైదరాబాద్‌లోని ఓయూ ఆడిటోరియంలో ప్రకటించారు. అధ్యక్షుడిగా కొప్పుల రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు, ప్రధాన కార్యదర్శులుగా ఆరెం అరుణ్‌కుమార్, సున్నం సతీశ్, కుర్సింబెల్లి గణేశ్, వెడమ కిషన్, ఉపాధ్యక్షులుగా గౌరవేణి ప్రవీణ్, చర్ల రవి, సాడే నవీన్, సిడాం రమేశ్, సహాయ కార్యదర్శిగా కోరం వీరయ్య, ప్రచార కార్యదర్శులు గావిడి నాగబాబు, ఇరు ప్రభాకర్, కోశాధికారి వెంకన్న, సభ్యులుగా వట్టం నవీన్, నవీన్ బచ్చలి, కుంజ రుక్మిణిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ ఇకపై ఓయూ కేంద్రంగా ఆదివాసీ విద్యార్థి, సామాజిక సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఏఎస్‌యూ తిరుగు లేని పోరాటాలను చేస్తుందని తెలిపారు.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఎదురుకాల్పులు

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 24 : రాష్ట్ర సరిహద్దు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఆదివారం మావోయిస్టులు, జవాన్లకు మరోసారి జరిగిన భీకర పోరులో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్టు సమాచారం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా-దంతెవాడ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కటేకళ్యాణ్ ఏరియా కమిటీ ఉన్నదని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో దంతెవాడ డీఆర్‌జీ భద్రతా దళాలు డబ్బాకున్ను అడవుల్లో మావోయిస్టులు ఉన్న ప్రాంతంలోకి ప్రవేశించాయి. జవాన్లను గమనించిన మావోయిస్టులు కాల్పులకు దిగారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య సుమారు 30 నిమిషాలపాటు భీకరపోరు జరిగినట్టు తెలుస్తున్నది. జవాన్ల ధాటికి తాళలేని మావోయిస్టులు ఆ ప్రాంతం నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత ఘటనా స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న జవాన్లు గాలింపు చర్యలు చేపట్టగా, ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభించినట్టు తెలిసింది. వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రిని సైతం భద్రతా దళాలు స్వాధీనపరుచుకున్నట్టు సమాచారం. ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉన్నది.

ఎన్ఐటీలకు కాంట్రాక్ట్ ఫ్యాకల్టీయే దిక్కు

- కీలక డిపార్టుమెంట్లలో అధ్యాపకుల కొరత
- 1,458 పోస్టులు ఖాళీ
- నిధుల పెంపు స్వల్పమే
- ప్రణాళికేతర బడ్జెట్‌లో రూపాయి విదల్చని కేంద్రం

ఆరేండ్ల ఖర్చుల వివరాలు

సంవత్సరం	ఖర్చులు (కోట్లల్లో)
2017-18	3,451.74
2018-19	3,388.67
2019-20	3,486.60
2020-21	3,252.45
2021-22	3,834.88
2022-23	4,063.84

విద్యార్థుల వివరాలు

కోర్సులు	విద్యార్థుల సంఖ్య
అండర్ గ్రాడ్యుయేట్	87,183
పోస్ట్ గ్రాడ్యుయేట్	24,114
పీహెచ్‌డీ	16,221
మొత్తం	1,27,518

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లంటే ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలన్న పేరున్నది. ఇంజినీరింగ్ టాప్ కాలేజీల్లో ఎన్ఐటీలదే అగ్రస్థానం. అలాంటి ఎన్ఐటీల్లో ఫ్యాకల్టీ కొరత వేధిస్తున్నది. ఇక్కడా.. అక్కడా అన్న తేడాల్లేకుండా అన్ని సంస్థల్లోనూ అదే పరిస్థితి నెలకొన్నది. కీలక డిపార్ట్‌మెంట్లల్లో ఫ్యాకల్టీ లేక కాంట్రాక్ట్ లెక్చరర్లతో నెట్టుకొస్తున్నారు. తాజా అంచనాల ప్రకారం ఎన్ఐటీల్లో 1,458 ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవి మినహాయిస్తే మరో 1,002 మంది కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ ఉండగా, ఇవి కూడా ఖాళీకిందనే లెక్క. జాతీయంగా 31 ఎన్ఐటీలుండగా వీటిల్లో 7,483 ఫ్యాకల్టీ పోస్టులున్నాయి. వీటిలో 5,023 రెగ్యులర్, 1,002 కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. మొత్తం కలుపుకొంటే 6,025 మంది ఫ్యాకల్టీ మాత్రమే పని చేస్తున్నారు. ఇంజినీరింగ్‌లో అత్యున్నత విద్యను ఎన్ఐటీలు అందిస్తున్నాయి. ఎన్ఐటీ తిరుచురాపల్లి, సురత్కల్, వరంగల్, రూర్కీ, కాలికట్‌లు టాప్ -5 స్థానంలో నిలిచాయి. ఐఐటీల తర్వాత అత్యధికంగా ఇంజినీరింగ్ విద్యార్థుల్లో అత్యధికులు ఎన్ఐటీలనే ఆశ్రయిస్తుంటారు. ఇలాంటి ఎన్ఐటీల్లో ఫ్యాకల్టీ కొరత ఏర్పడటంతో విద్యాప్రమాణాలపై ప్రభావం పడుతున్నది.

నిధులు అంతంత మాత్రమే..

తాజా వివరాల ప్రకారం ఎన్ఐటీల్లో 1.27 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రిసెర్చ్ విద్యార్థులు గణనీయంగానే ఉంటారు. అయినా, ఈ సంస్థలకు కేంద్రం అరకొర నిధులనే కేటాయిస్తున్నది. బడ్జెట్ రూ. 4 వేల కోట్లకు మించడం లేదు. ఒక్క 2022 -23 విద్యాసంవత్సరం మినహా గత ఐదేండ్లల్లో అంతంత మాత్రంగానే నిధులను ఖర్చుచేసింది. ఇదంతా ప్రణాళికా వ్యయమే కావడం విశేషం. ప్రణాళికేతర కోటాలో నయా పైసా విదల్చలేదు. ఇటీవలి కాలంలో విద్యాసంస్థల్లో రిసెర్చ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రాజెక్ట్‌లను విరివిగా ప్రోత్సహిస్తున్నారు. ఈ దిశలో నిధుల కేటాయింపు లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది.

ప్రాణం తీసిన

క్రికెట్ వివాదం

బాలుడిని చంపిన మరో బాలుడు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): క్రికెట్ ఆటలో నెలకొన్న వివాదం ఓ బాలుడి ప్రాణాన్ని బలితీసుకున్నది. ఈ ఘటన ఆదివారం నెల్లూరులోని జాకీర్ హుస్సేన్‌నగర్‌లో జరిగింది. సెలవురోజు కావడంతో పలువురు క్రికెట్ ఆడుతున్నారు. ఆటలో తలెత్తిన వివాదంతో 14 ఏండ్ల బాలుడిని 16 ఏండ్ల మరో బాలుడు గొంతు, గుండెపై గట్టిగా కొట్టగా అక్కడే కుప్పకూలాడు. అతనిని దవాఖానకు తరలించగా, అప్పటికే చనిపోయినట్టు డాక్టర్లు నిర్ధారించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాధ్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

80 బడుల్లో వొకేషనల్ విద్య

- 9, 11 తరగతుల్లో శిక్షణ
- 10, 12 తరగతుల్లో ప్రాక్టికల్స్, పరీక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): పదోతరగతి వరకే చదివాను.. ఇంటర్ మాత్రమే పూర్తిచేశాను ఈ విద్యార్థులతో ఉద్యోగాలు సంపాదించడం ఎలా? చదువుకున్న చదువు.. తెచ్చుకొన్న మార్కులతో ప్రయోజనమేమి లేదే. మరీ ఇప్పుడెలా అన్న సంకోచక స్థితి నుంచి విద్యార్థులను బయటపడేసేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకొన్నది. పాఠశాల దశలోనే విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇలా రాష్ట్రంలోని 80 బడుల్లో వొకేషనల్ విద్యను ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందుకు 66 కేజీబీవీలను, 14 తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ గురుకులాలను ఎంపిక చేస్తూ ఉత్తర్వులిచ్చింది. 2023-24 సమగ్రశిక ప్రాజెక్ట్ అప్రూవల్‌బోర్డులో ఈ స్కూళ్లల్లో వొకేషనల్ విద్య అమలుకు ఆమోదం లభించింది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) సహకారంతో ఈ కోర్సులను నిర్వహిస్తారు. ఎంపిక చేసిన బడుల్లోని 9, 11 తరగతుల్లో శిక్షణ ఇస్తారు. 10, 12 తరగతుల్లో ప్రాక్టికల్స్, పరీక్షలను నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ శిక్షణనిచ్చేందుకు పలు సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకొన్నారు.

కోర్సులివే..

డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, మైక్రోఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, హోం హెల్త్ ఎయిడ్ ట్రెయినీ, అసిస్టెంట్ బ్యూటీ థెరిపిస్ట్, సోలనాసియస్ క్రాప్ కల్టివేటర్, జామ్ జెల్లీ కెచప్ ప్రాసెసింగ్ టెక్నీషన్, ఆప్టికల్ ఫైబర్ స్పిసర్, స్వీయింగ్ మిషన్ ఆపరేటర్ వంటి కోర్సులున్నాయి.

టీజీఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడిగా గాదె వెంకన్న

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీఎల్ఏ) నూతన రాష్ట్ర కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. నూతన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాదె వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామచంద్రారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రజని, జనరల్ సెక్రటరీగా కుమారస్వామి ఎన్నికయ్యారు. అదే విధంగా కార్యనిర్వాహక కార్యదర్శిగా గోవర్ధన్, ఉపాధ్యక్షులుగా యుగేందర్, శ్రీపతి సురేశ్ బాబు, చంద్రశేఖర్, కోశాధికారిగా పిడమర్తి ఉపేందర్, ప్రచార కార్యదర్శిగా సతీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈనెల 29న బ్రహ్మాండమైన విడుదల

ప్రసాద్ - ఎన్.బి.ఆర్.మల్టీప్లెక్స్ | పీవీఆర్ - బంజారాహిల్స్, పెంట్రల్‌మాల్ - పంజాగుట్ట, ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్, ఫోరంమాల్ - కూకట్‌పల్లి, గలేరియా - పంజాగుట్ట, పీవీఆర్ - ఎర్రమంజిల్, పీవీఆర్ - మూసారంబాగ్, ప్రెస్టేజ్ ప్లేమ్ - గచ్చిబౌలి, ఐకాన్ - హైటెక్ సిటీ, ATRIUM మాల్ - గచ్చిబౌలి, ఎస్‌ఐ ఎ/సి - మల్లాపూర్, మంజీరా మాల్ - కూకట్‌పల్లి, CCPL - మల్కాజ్‌గిరి, డి.ఎల్.ఎస్ - ఉప్పల్, మంక్రైమాల్ - అత్తాపూర్

ముంతా - శాలిబండ, ఐనాక్స్ - బంజారాహిల్స్, జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ, ఎం.వి.మాల్ - కాచిగూడ, సత్యవెంకిస్ మాల్ - కవాడిగూడ, అశోక ఎ/సి - వై.జంక్షన్, మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్, మీరజ్ సినిమాస్ - ఐడిఎల్, మీరజ్ సినిమాస్ - చందానగర్, రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి, లక్ష్మీపరమేశ్వర - మియాపూర్, ఎంఎంఆర్ - మౌలాలి, ప్లాటినమ